

# రోహిత్‌కు రాం..రాం

**కెప్టెన్సీ నుంచి తప్పించిన ముంబై**

**హార్దిక్ పాండ్యా సారథ్యంలో బరిలోకి**

**ఫ్రాంచైజీపై సోషల్ మీడియాలో ఫ్యాన్స్ ట్రోలింగ్**

లియోనల్ మెస్సీ-బార్సిలోనా, క్రిస్టియానో రొనాల్డో-రియల్ మాడ్రిడ్, ధోనీ-చెన్నై సూపర్‌కింగ్స్..ఇదే కోవలో రోహిత్‌శర్మ-ముంబై ఇండియన్స్. ఇవి సూపర్ హిట్ కాంబినేషన్స్. ఈ స్టార్ ప్లేయర్లను వేరే జట్లతో ఊహించుకోవడానికి అభిమానులకు మనసు ఒప్పదు. కానీ కాలానికి తగ్గట్లు మనుషులు మారాలి అన్నట్లు. ముంబైతో రోహిత్12 ఏండ్ల అనుబంధానికి తాజాగా ముగింపు పడింది. సచిన్ టెండూల్కర్, రికీ పాంటింగ్, హర్భజన్‌సింగ్ లాంటి దిగ్గజాలకు సాధ్యం కాని ముంబైకి టైటిల్ కరువును రోహిత్‌శర్మ వచ్చి రావడంతోనే తీర్చేశాడు. తన అద్భుత నాయకత్వ పటిమతో పదేండ్ల కాలంలో ముంబైకి ఐదు ఐపీఎల్ టైటిళ్లతో పాటు చాంపియన్స్‌లీగ్ విజేతగా నిలిపి ఔరా అనిపించాడు. సుదీర్ఘ ఐపీఎల్ చరిత్రలో ముంబైకంటూ ఒక ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించిన రోహిత్‌ను ఫ్రాంచైజీ పక్కకు తప్పిస్తూ హార్దిక్ పాండ్యాకు కెప్టెన్సీ పగ్గాలు అప్పజెప్పింది. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని రోహిత్‌కు రాంరాం పలుకుతూ హార్దిక్‌ను కెప్టెన్‌గా చేయడంపై సోషల్‌మీడియాలో అభిమానులు తీవ్రంగా స్పందిస్తున్నారు.

ముంబై: ముంబై ఇండియన్స్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి రోహిత్‌శర్మను తప్పిస్తూ ఫ్రాంచైజీ శుక్రవారం అనూహ్య నిర్ణయం తీసుకుంది. గత రెండేండ్లుగా గుజరాత్ టైటాన్స్ కెప్టెన్‌గా వ్యవహరించి ఈ మధ్యే తిరిగి జట్టులోకి వచ్చిన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాకు నాయకత్వ బాధ్యతలు అప్పగించింది. ఈ విషయాన్ని తమ అధికారిక సోషల్‌మీడియా సైట్ల ద్వారా అభిమానులతో ముంబై ఇండియన్స్ పంచుకుంది. జట్టు ఫెర్ఫార్మెన్స్ గ్లోబల్ హెడ్ మహేలా జయవర్దనే మాట్లాడుతూ 'భవిష్యత్ అవసరాల దృష్ట్యా..వారసత్వాన్ని కొనసాగించేందుకు ముంబై ఇండియన్స్ మొగ్గుచూపింది. ఇందులో భాగంగా సచిన్ నుంచి హర్భజన్ సింగ్, రికీ పాంటింగ్ నుంచి రోహిత్‌శర్మ, ఇప్పుడు రోహిత్ నుంచి హార్దిక్‌కు నాయకత్వ బదిలీ జరిగింది. జట్టును మరింత బలంగా తీర్చిదిద్దే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నాం. రోహిత్ సారథ్యంలో ముంబై అనితర సాధ్యమైన విజయాలు సాధించింది. ఇందులో ఎలాంటి సందేహం లేదు. అతను అద్భుతమైన నాయకత్వ శైలితో జట్టును ముందుండి నడిపించాడు. కెప్టెన్సీతో ఐపీఎల్ చరిత్రలో రోహిత్‌కు ప్రత్యేక గుర్తింపు దక్కింది' అని అన్నాడు. ఇదిలా ఉంటే ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీపై సోషల్‌మీడియాలో అభిమానులు దుమ్మెత్తి పోస్తున్నారు.



## 23 ఏండ్ల తర్వాత..

**ఆల్‌ఇండియా ఫుట్‌బాల్ టోర్నీలో ఓయూ**



హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఆల్‌ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీకి యూనివర్సిటీ ఎంపికైంది. మంగళూరు వేదికగా జరిగిన సౌత్‌ఈస్ట్ జోన్ ఫుట్‌బాల్ టోర్నీలో ఓయూ ఫుట్‌బాల్ టీమ్ నాలుగో స్థానంలో నిలిచింది. దీంతో 23 ఏండ్ల తర్వాత ఆల్‌ఇండియా టోర్నీకి ఓయూ అర్హత సాధించింది. ఈస్ట్ జోన్ ఫుట్‌బాల్ టోర్నీలో ఓయూ టీమ్ ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించింది. ఓయూ తరపున సయ్యద్ ఇంతియాజ్ హుస్సేన్ తొమ్మిది గోల్స్‌తో టాప్‌లో నిలువగా, సయ్యద్ ఒవైసుద్దీన్ రెండు గోల్స్ ఖాతాలో వేసుకున్నాడు.

## పార్వతికి కాంస్యం

**ఆసియా పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్**



హైదరాబాద్, ఆట ప్రతినిధి: జోహర్‌బహ్రు (మలేషియా) వేదికగా ఆసియా క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో రాష్ర్టానికి చెందిన పార్వతి శ్రీరామ్ కాంస్య పతకంతో మెరిసింది. మహిళల 69కిలోల విభాగంలో బరిలోకి దిగిన పార్వతి స్క్వాట్‌లో కాంస్య పతకాన్ని ఖాతాలో వేసుకుంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో పవర్‌లిఫ్టింగ్‌ను కెరీర్‌గా మొదలుపెట్టిన పార్వతి రాష్ట్ర స్థాయి టోర్నీలో స్వర్ణం సహా జాతీయ పవర్‌లిఫ్టింగ్ టోర్నీలో రజతం దక్కించుకుంది. స్వల్ప వ్యవధిలోనే పవర్‌లిఫ్టింగ్‌లో అంతర్జాతీయ ఎదగడంపై కఠిన శ్రమ దాగుందని ఆమె పేర్కొంది. క్రమశిక్షణకు తోడు సాధించాలన్న పట్టుదలతో తాను ఈ స్థాయికి ఎదిగినట్లు తెలిపింది.

## ఆస్ట్రేలియా 487; పాక్ 132/2



పెర్త్: పాకిస్థాన్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఆస్ట్రేలియా భారీ స్కోరు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 346/5తో శుక్రవారం రెండో రోజు తొలి ఇన్నిం గ్స్ కొనసాగించిన ఆసీస్.. 487 పరుగులకు ఆలౌటైంది. మిషెల్ మార్ష్ (90; 15 ఫోర్లు, ఒక సిక్సర్) ధాటిగా ఆడాడు. పాక్ బౌలర్లలో అరంగేట్ర పేసర్ జమాల్ ఆరు వికెట్లు పడగొట్టాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన పాకిస్థాన్ ఆట ముగిసే సమయానికి రెండు వికెట్లు కోల్పోయి 132 పరుగులు చేసింది. అబ్దుల్లా షఫీఖ్ (42), ఇమామ్ (38 బ్యాటింగ్), కెప్టెన్ షాన్ మసూద్ (30) ఫర్వాలేదనిపించారు. చేతిలో 8 వికెట్లు ఉన్న పాక్.. ప్రత్యర్థి స్కోరుకు ఇంకా 355 పరుగులు వెనుకబడి ఉంది.

**ఏకైక టెస్టుపై పట్టు బిగించిన భారత్**

# దీప్తి పాంచ్ పటాకా

**తొలి ఇన్నింగ్స్‌లో 428 • రెండో ఇన్నింగ్స్‌లో 186/6 • ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 136 ఆలౌట్**

పొట్టి ఫార్మాట్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోయిన మన అమ్మాయిలు.. ఇంగ్లండ్‌తో ఏకైక టెస్టులో దుమ్మురేపుతున్నారు. తొలి రోజే రికార్డు స్కోరు చేసి ప్రత్యర్థిని ఆత్మరక్షణలోకి నెట్టిన టీమ్‌ఇండియా.. స్పిన్ బౌలింగ్‌తో ఇంగ్లిష్ టీమ్‌ను కకావికలం చేసింది. బ్యాట్‌తో రాణించిన దీప్తి.. బంతితో పాంచ్ పటాకా మోగించడంతో ఇంగ్లండ్ స్వల్ప స్కోరుకే పరిమితమైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన హర్మన్‌ప్రీత్ బృందం విజయానికి చేరువైంది.



దీప్తి శర్మ (5/7)

ముంబై: రెండేండ్ల తర్వాత బరిలోకి దిగిన టెస్టులో భారత మహిళల జట్టు అదరగొడుతున్నది. బ్యాటర్లంతా సమిష్టిగా రాణించడంతో భారీ స్కోరు చేసిన టీమ్‌ఇండియా.. బౌలింగ్‌లోనూ సత్తచాటి ఇంగ్లండ్‌ను ఓటమి అంచుల్లోకి నెట్టింది. ఓవర్‌నైట్ స్కోరు 410/7తో రెండో రోజు శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ మరో 18 పరుగులు జోడించి 428 పరుగులకు ఆలౌటైంది. దీప్తి శర్మ (67) రాణించింది. ఇంగ్లండ్ బౌలర్లలో సోఫియా ఎకిల్‌స్టోన్, లారెన్ బెల్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్.. 136 పరుగులకే కుప్పకూలింది. స్కీవర్ బ్రంట్ (59; 10 ఫోర్లు) అర్ధశతకం సాధించగా.. తక్కినవాళ్లంతా ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు చేరారు. బ్యూమాంట్ (10), సోఫియా (11), కెప్టెన్ హీథర్ నైట్ (11), డానీ వ్యాట్ (19), అమీ జోన్స్ (12), సోఫి ఎకిల్‌స్టోన్ (0), చార్లీ డీన్ (0) విఫలమయ్యారు. భారత బౌలర్లలో దీప్తి శర్మ 5.3 ఓవర్లలో 7 పరుగులు మాత్రమే ఇచ్చి 5 వికెట్లు పడగొట్టింది. ఒక దశలో 108/3తో పటిష్ఠ స్థితిలో కనిపించిన ఇంగ్లండ్,, దీప్తి బంతి అందుకున్న తర్వాత తీవ్రంగా ఇబ్బంది పడింది. పది పరుగుల తేడాలో ఆ జట్టు చివరి 6 వికెట్లు కోల్పోయింది. స్నేహ్ రాణా రెండు వికెట్లు తీసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్.. శుక్రవారం ఆట ముగిసే సమయానికి 6 వికెట్లు కోల్పోయి 186 పరుగులు చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (44 బ్యాటింగ్), షఫాలీ వర్మ (33), జెమీమా (27), స్మృతి మంధన (26) రాణించారు. ఇంగ్లిష్ బౌలర్లలో చార్లీ డీన్ 4, ఎకిల్‌స్టోన్ రెండు వికెట్లు పడగొట్టింది. చేతిలో మరో నాలుగు వికెట్లు ఉన్న భారత్.. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కలుపుకొని ఇంగ్లండ్ కంటే.. 478 పరుగుల ఆధిక్యంలో ఉంది. సారథి హర్మన్‌తో పాటు పూజ వస్త్రాకర్ (17) క్రీజులో ఉంది. ఆటకు మరో రెండు రోజుల గడువు ఉండటంతో ఇంగ్లిష్ జట్టు ముందు మనవాళ్లు ఎంత లక్ష్యాన్ని నిర్దేశిస్తారో చూడాలి. మొత్తంగా శుక్రవారం ఒక్కరోజే ఇరు జట్లు కలిపి 19 వికెట్లు పడగొట్టడం గమనార్హం.

**సంక్షిప్త స్కోర్లు**

భారత్ తొలి ఇన్నింగ్స్: 428 (సుభ 69, జెమీమా 68; లారెన్ బెల్ 3/67, సోఫియా 3/91), ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 136 (స్కీవర్ బ్రంట్ 59; దీప్తి 5/7, స్నేహ్ రాణా 2/25), భారత్ రెండో ఇన్నింగ్స్: 42 ఓవర్లలో 186/6 (హర్మన్‌ప్రీత్ 44 నాటౌట్, షఫాలీ 33; చార్లీ డీన్ 4/68).



## '7'కు గుడ్‌బై

న్యూఢిల్లీ: దేశానికి రెండు ప్రపంచకప్‌లు అందించిన టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీని బీసీసీఐ సముచితంగా గౌరవించింది. దేశానికి ప్రాతినిధ్యం వహించిన సమయంలో ధోనీ వినియోగించిన జెర్సీ నంబర్ 7ను ఇకపై ఎవరికీ ఇవ్వకూడదని నిర్ణయించింది.'అతడో దిగ్గజం. భారత క్రికెట్‌కు ధోనీ ఎంతో చేశాడు. మహీ ఘనతలకు గుర్తింపుగా.. ఏడో నంబర్‌కు రిటైర్మెంట్ ప్రకటించాం' అని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా పేర్కొన్నాడు. గతంలో సచిన్ జెర్సీ నంబర్ (10) విషయంలోనూ బోర్డు ఇదే పనిచేసింది.

## సెమీస్‌లో భారత్ ఓటమి

దుబాయ్: అండర్-19 ఆసియాకప్ సెమీఫైనల్లో భారత జట్టు 4 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్ చేతిలో ఓడింది. యంగ్‌ఇండియా 42.4 ఓవర్లలో 188 పరుగులకు ఆలౌటైంది. తెలంగాణ కుర్రాడు మురుగన్ అభిషేక్ (62; 6 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించారు. అనంతరం చేజింగ్‌లో బంగ్లా 42.5 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 189 రన్స్ చేసింది.

## మెస్సీ జెర్సీ కాస్ట్‌లీ గురూ

- ఆరు జెర్సీలకు 64.75 కోట్లు



న్యూయార్క్: అర్జెంటీనా సాకర్ స్టార్ లియోనల్ మెస్సీకి ఉన్న క్రేజ్ గురించి కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. అతను ఆడితే లోకమే ఆడదా అన్నట్లు మెస్సీ ఆటకు మైమరిచిపోని అభిమాని లేడు. గతేడాది ఖతార్ వేదికగా జరిగిన ప్రతిష్ఠాత్మక ఫిఫా ప్రపంచకప్‌లో మెస్సీ ధరించిన జెర్సీలకు కండ్లు చెదిరే ధర పలికింది. ప్రముఖ వేలం సంస్థ సౌత్‌బే మెస్సీ ధరించిన ఆరు జెర్సీలను వేలం వేయగా ఏకంగా రూ.64.75 కోట్ల ధర పలికాయి. ఈ ఏడాది స్పోర్ట్స్ పరంగా అత్యధిక ధర లభించనవి ఇవేనని సౌత్‌బే ఒక ప్రకటనలో పేర్కొంది.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.